

ఉష్ణోగ్రత (అంచనా)

19-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	36	27
చీరాల	35	28



పిడుగురాళ్ల ప్రధాన రహదారి పక్కన కాలువపై ఆక్రమణ



వినుకొండ : డ్రెయిన్ దుస్థితి





గుంటూరు నగరంలో ఆక్రమణ గురైన ప్రధాన మురుగు కాలువలు

డ్రెయిన్లన్నీ మూత

మురుగు పారేదెలా?

రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. తెల్లారి లేచి చూసిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడ్డుగు పెట్టే పరిస్థితి లేనంతగా నీరు, మురుగుతో రోడ్లన్నీ నిండిపోయాయి. పట్టణ మధ్యలోని ప్రాంతాలతో పాటు శివార్లలోనూ ఇదే పరిస్థితి. వర్షపు నీరు పారుదల లేనంతగా కాల్వలన్నీ ఆక్రమించేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయినా మున్సిపల్ పాలకుల్లో చలనం లేదు. ఓ మోస్తరు వర్షాలకే రోడ్లన్నీ తటాకాల్లా మారుతున్నా.. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా.. పరిస్థితి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కాల్వల్లో చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించే అవకాశం లేకుండా శ్లాబులతో మూతేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. దీంతో అటు కాల్వల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండగా.. ఇటు వానొస్తే వరద అన్నట్లు పట్టణాల్లో పరిస్థితి నెలకొంది.

- ఆక్రమణల్లో సైడు కాల్వలు
- పూడిక తొలగించే పరిస్థితీ లేదు
- మురుగు పారక ప్రజల అవస్థలు
- చినుకుపడితే రహదారులన్నీ జలమయం
- ఆక్రమణలపై దృష్టి సారించని పుర పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

వానొస్తే.. వరద.. వణుకు

వర్షాలు వస్తున్నాయంటే గుంటూరు నగరం, జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు మున్సిపల్ పట్టణాల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన కాల్వలు ఆక్రమణలతో కొన్ని కుదించుకోగా.. మరికొన్ని పూడిక తీసే అవకాశం లేకుండా దుకాణదారులు, ఇళ్ల యజమానులు మూతేశారు. దీంతో డ్రెయిన్లు చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగే అతి కష్టంగా పారుదలవుతుంటుంది. ఈ పరిస్థితుల్లో వర్షపు నీరు పోయే దారి లేక.. డ్రెయిన్లలోని మురుగునీటికి వర్షపు నీరు తోడై రోడ్లపైకి వచ్చేస్తోంది. దీంతో ప్రధాన రహదారులతో పాటు శివారు కాలనీలు వర్షాల సమయంలో తటాకాల్లా మారుతాయి. అపరిశుభ్రత.. దుర్వాసన.. చెత్తా చెదారాలతో వర్షాలు వస్తున్నాయంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాల వెనుక మురుగు కాలువను మూసిన వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి - గుంటూరు నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాలు.. అయినా వర్షాల సమయంలో మురికి కూపాలుగా మారిపోతున్నాయి. ప్రధాన డ్రెయిన్లతో పాటు సైడు కాల్వలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయి. మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేయకుండా సైడ్ డ్రెయిన్లను శ్లాబు, బండలతో మూతేస్తున్నారు. కాల్వ ల్లో పడుతున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొల గించేందుకు పారిశుధ్య కార్మికులకు పెద్ద తల నొప్పిగా మారింది. కాల్వలపైనే ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్లపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు కాల్వలపై ఆక్రమణలు పట్టించు కోకపోవడంతో ఇదే అవకాశంగా మిగిలిన వారు కూడా చెలరేగిపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అధికా రులు నోటీసులు, ప్రచారాలకే పరిమితమవు తున్నా రు. దీంతో వర్షాల సమయంలో మురుగునీరు రోడ్ల పైకి చేరుతోంది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ సమయాల్లో మున్సిపల్ పాలకులు, అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత కూడా కాల్వలపై ఆక్రమణలను తొలగించి వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చూసి ముంపు సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలం దగ్గరకు వస్తున్నా పురపాలకులు వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీసే పనులు చేపట్టడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

☛ గుంటూరు నగరంలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, పీకల వాగుతో పాటు కాకాని రోడ్డు, నందివెలుగు రోడ్డు, రింగ్‌రోడ్డు, గుజ్జనగుండ్ల, ఆర్టీసీ బస్టాండ్, పల్నాడుబస్టాండ్, నగరంపాలెం, కొరటిపాడు, అమరావతి రోడ్లలోని కాల్వలు, నగరాలు నుంచి రెడ్డిపాలెం మీదగా కాకాని రోడ్డుకు వెళ్లే డ్రెయిన్ ఆక్రమణలకు గురయ్యాయి. అంతర్గత కాల్వలు కూడా అనేక చోట్ల ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వర్షాల సమయంలో నీరు పారుదలకు ఆటంకాలు ఏర్పడి ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రోడ్లు తటాకాల్లా మారుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే గుంటూరు నగరం జలమయంగా మారుతుంది.

ఇప్పటికైనా దృష్టి పెట్టేనా?

గుంటూరు నగర మేయర్‌గా ఇటీవల కోవెల మూడి రవీంద్ర(నాని) ఎన్నికయ్యారు. కొత్త పాలక వర్గంలో వైసీపీ కార్పొరేటర్లు పలువురు చేరారు. దీంతో నగరపాలక సంస్థలో కూటమి బలం పెరిగింది. ఈ పరిస్థితుల్లో కొత్త పాలకవర్గమైన నగరంలో నెల కొన్న ఆక్రమణలపై దృష్టి సారించాలని, వర్షపు నీటి ముంపు నుంచి తమను తప్పించాలని ప్రజలు కోరుకుతున్నారు.



నరసరావుపేట : పల్నాడు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



నరసరావుపేట: రిలయన్స్ వద్ద పూడిపోయిన ప్రధాన వరద నీటి కాలువ

☛ నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని కాల్వల్లోని జమ్ము నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉంది. సత్తెనపల్లి, వినుకొండ, గుంటూరు, పల్నా డు రహదారుల్లోని ప్రధాన మురుగు కాల్వలు పూడికతో పూడి పోయాయి. వీటిలో నీరు ప్రవ హించే పరిస్థితి లేదు. పట్టణంలోని ప్రధాన కాల్వలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఓ మోస్తరు వర్షానికే నీరు పొంగి రోడ్లు తటా కాల్లా మారుతున్నా యి. ఆరేళ్ల క్రితం కురిసిన భారీవర్షంతో పట్ట ణంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గుర య్యాయి. ఈ సంఘటన నుంచి ఇప్పటి వరకు అధికారులు గుణపాఠం నేర్చుకోక పోవడం గమనార్హం.

☛ పిడుగురాళ్ల పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న సైడ్ డ్రెయిన్లు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురయ్యాయి. అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి, తహసీల్దార్ కార్యాలయం సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, ఐలాండ్ సెంటర్ నుంచి జానపాడు రోడ్డులోని రైల్వేగేటు వరకు కాల్వలను దుకాణ దారులు ఆక్రమించి మూతేశారు.

ప్రతిపాదించినా.. పట్టించుకోరు


తాగునీటి కేటాయింపులపై తాత్సారం

- 10 టీఎంసీలు కావాలన్నా స్పందించని ప్రభుత్వం
- కేఆర్ఎంబీ అనుమతిస్తేనే సాగర్ నుంచి నీటి విడుదల
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పల్లెల్లో నీటి ఎద్దడి

50 శాతం చెరువుల్లో నిండుకున్న నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువుల్లో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి.. ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి తాగు అవసరాలకు నీటి విడుదల విషయంలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలున్నాయి. సాగర్ కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాల్లో చెరువులు నింపేందుకు 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే రోజులు గడు స్తున్నా కేటాయింపులపై నేటికీ నిర్ణయిం తీసు కోలే దు. ఈ నెల మూడో వా రంలో నీటి సరఫరా చేయ నున్నట్లు ముందుగానే జలవనరుల శాఖ ప్రక టించింది. అయితే కేఆర్ఎంబీ నుంచి ఇంతవరకు అనుమతులు రాకపోవడం తో నీటి విడుదల ప్రశ్నా ర్థకంగా మారింది. కుడి కాల్వకు కేటా యింపుల మించి నీటి ని వినియోగించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ వద్ద వాదిస్తోంది. తాగు అవసరాలకు కూడా నీటి విడుదలకు అనుమతి ఇవ్వొద్దని కేఆర్ఎంబీపై ఆ రాష్ట్ర అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ వాదనను తిప్పి కొడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించాలని కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చకముందే సాగర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



బొల్లాపల్లి : గండిగనుమలలో నీటి కోసం పాట్లు

కుడి కాల్వ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన వందలాది చెరువులు సాగర్ జలాలపై ఆధారపడి ఉన్నాయి. దాదాపు 50 శాతం చెరువుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ గణాంకా లు చెబుతున్నాయి. చెరువులకు సత్వరం నీటిని సరఫరా చేయా లని ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ నుంచి జలవనరుల శాఖకు ప్రతిపాదనలు అందాయి. వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల తదితర మున్సి పాల్టీల్లోని చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నెలకొన్న తాగు నీటి ఎద్దడిని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకువెళ్లి నీటి కేటాయింపులు పొందాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంది. కనీసం 8 టీఎంసీలు నీటిని సాగర్ నుంచి వినియో గించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతులు ఇవ్వాలన్న వాద నను అధికారులు వినిపిస్తున్నారు. తాగు అవసరాలకు 10 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారుల కు ప్రతిపాదనలు పంపామని, అయితే ఇంకా అనుమతి రాలేదని జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు.

సాఫీగా.. జేఈఈ అడ్వాన్స్

గుంటూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీ కళాశాలలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, నరసరావుపేట పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ బేస్డ్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి 12 వరకు సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను పరీక్షకు గంట ముందు కేంద్రాల్లోకి అనుమతించారు. దాదాపు 6000 మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సమాచారం.

టీడీపీతోనే బడుగుల అభివృద్ధి

- మినీ మహానాడులో మండలి చీఫ్ విప్ అనురాధ
- మూడు తీర్మానాలను ఆమోదించిన మంగళగిరి శ్రేణులు




ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

మంగళగిరి సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు ఆదివారం జరిగింది. తొలుత నేతలు జ్యోతి ప్రజ్వలన చేసి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చేయడం, అవినీతి రహిత నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దడం, పార్టీ శ్రేణుల మృతికి సంతాప తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారని, నియోజకవర్గంలోనూ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి రాజకీయ విప్లవం, సామాజిక చైతన్యం తీసుకువచ్చారని చెప్పారు. పెత్తందార్లు, సంపన్నులు రాజకీయాల్లో ఏలుబడి సాగిస్తున్న రోజుల్లో ఎన్టీఆర్ అతి సామాన్యులకు సైతం టిక్కెట్లు ఇచ్చి శాసనసభకు పంపించారని గుర్తుచేశారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు కూడు,గూడు,వస్త్రం, నినాదంతో పుట్టిన తెలుగుదేశం పార్టీ నాటి నుంచి నేటి వరకు బడుగుల జీవితాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, నియోజకవర్గ పరి శీలకుడు ముమ్మిడి సత్యనారా యణ, టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్, ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నాయకులు మహ్మద్ ఇబ్రహీం, మాదల రమేష్ బాబు, గాదె పిచ్చిరెడ్డి, వింజమూరి ఆషాబాల, వెలగపాటి విలియం, గోవాడ దుర్గారావు, పోలుమట్ల ప్రేమ్‌కుమార్, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, విన్నకోట శ్రీనివాసరావు, మల్లవరపు వెంకట్, వేమూరి మైనర్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర భవితకు భరోసాగా.. మహానాడు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్‌కు భరోసాగా కడపలో జరిగే మహానాడు మారనున్నదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ప్రతిపాడు నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి గురించి మహానాడులో చర్చించనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి కల్పించిన ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. మహానాడు దిశా నిర్దేశంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడతాయని ఆకాంక్షించారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు, ఎకనామిక్ జోన్, అమృత పథకాలకు నిధులు, రింగురోడ్డు విస్తరణ, దాదాపు 3 వేల మందికి ఇంటి పట్టాలతోపాటు పలువురు లబ్దిదారులుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశామని గుర్తుచేశారు. మిగిలిన అభివృద్ధి పనులుపై తీర్మానాలు చేసి మహానాడులో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వందనాదేవి, కొల్లా వీరయ్య చౌదరి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, నక్కల అగస్టీన్, కల్లూరి శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, ఘంటసాల సోమశేఖర్, బొబ్బిలి రామారావు, గింజుపల్లి శివరాంప్రసాద్, నువ్వుల సునీల్, మన్నవ పూర్ణ చంద్రరావు, ఇమ్మడి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



సైనికుడి విగ్రహాన్ని పరిశీలిస్తున్న మంత్రి

దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయం

- మంత్రి మనోహర్

4

నేటి నుంచి నందమూరి కళాపరిషత్ నాటిక పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో నందమూరి తారకరామారావు 102వ జయంతి, ఆయన సినీ రంగంలోకి అడుగుపెట్టి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు భాగంగా సోమవారం నుంచి 21వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటిక, 2వ రోజు యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు నాటిక, రెండో ప్రదర్శనగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు నాటిక, 3వ ప్రదర్శన మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికతో పాటు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, 2వ ప్రదర్శనగా సౌజన్య కళాస్రవంతి, ఉత్తరాంధ్ర వారి దేవరాగం, మూడో ప్రదర్శనగా భద్రం ఫౌండేషన్, విశాఖపట్నం వారి దొందూ దొందే హాస్యనాటికలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడిగా జీవీ కుటుంబ సమేతంగా నాటకోత్సవాలు, వజ్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రేక్షకులు హాజరై వీక్షించాలని కోరారు.

పూటి లాగుడు ప్రదర్శనతో

పశు పోషకులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విరామ సమయంలో ఎడ్ల పూటి లాగుడు ప్రదర్శన పోటీలతో పశు పోషకులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం కొల్లూరు మండలం క్రాప వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి పూటి లాగుడు ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశు పోషకులు ఎంతో ఉత్సాహంగా పోటీలకు తమ ఎడ్ల జతలతో తరలి రావడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. కొద్దిసేపు ఎమ్మెల్యే పోటీలను తిలకించారు. జూనియర్ విభాగంలో ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొన్నాయి. సోమవారం సీనియర్ విభాగంలో మరో 8 జతలు, 20న నియోజకవర్గ స్థాయి టైరు బండి విభాగంలో ఆరు జతలు పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 25 ఎడ్ల జతలు పాల్గొనగా విజేతలైన ఎడ్ల జత యజమానులకు సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలుతో పాటు మిగిలిన జతలకు కూడా బహుమతులు ఇవ్వనున్నారు. జూనియర్ విభాగంలో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలుగా బహుమతులున్నాయి. మూడు రోజుల పోటీల్లో ఎడ్ల యజమానులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుంకర రామమోహనబాబు, తలశిల రవితేజ, గొట్టిపాటి భానుగంగాధర్ రైతులు పాల్గొన్నారు.

రాజధాని భూ సమీకరణకు రైతుల అంగీకారం

● బలుసుపాడు, కంభంపాడు గ్రామ సభలు ● స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా రాజధానిని నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములు ప్రభుత్వం తీసుకోదని, రైతులు ఇష్టపడి ఇస్తేనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, కంభంపాడు గ్రామాల్లో ఆదివారం రైతులతో ల్యాండ్ పూలింగ్ పై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అభివృద్ధే లక్ష్యంగా పనులను పరిగెత్తిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులతో కలసి భూ సమీకరణపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. రైతులకు న్యాయం చేసేలా చూ స్తామని భరోసా ఇచ్చారు. భూ సమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాసు బుక్‌ల జిరాక్స్‌లను అందించిన రైతులను దుశ్శాలువాలతో సత్కరించారు. పొలాలు ఇచ్చిన రైతుల పిల్లలు చదువుకుని ఉంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ ఇక్కడా కూడా అమలు చేస్తారని, ఈ ఏడాది కూడా ముందుగానే కౌలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా రైతులు, రైతు నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కుమార్, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరికపూడిశెల పూర్తి చేస్తేనే రాజకీయాలు..

● లేకుంటే జీవితంలో రాజకీయాలు మాట్లాడను ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శపథం



మాచర్లటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల కల వరికపూడిశెలను పూర్తి చేయకుంటే.. తన జీవితంలో రాజకీయాలు మాట్లాడనని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శపథం చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పల్లెల్లో వైసీపీ మూకలు రాజకీయ చిచ్చు రేపుతూ.. శునకానందం పొందుతున్నాయని ధ్వజమెత్తారు. వరికపూడిశెల పూర్తి చేస్తానని చెప్పి.. 15 సంవత్సరాలు రాజకీయ పబ్బం గడుపుకుని.. పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు రామకృష్ణారెడ్డి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన పిన్నెల్లి.. మాటమార్చి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఆ పని చిన్న పిల్లలు సైతం చేయగలరని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో వరికపూడిశెల ఫేజ్ - 1, ఫేజ్ - 2 పూర్తి చేసి పల్నాడు ప్రజలకు సాగు, తాగునీరు అందించి దాహార్తిని తీరుస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పేందుకు సహనం పాటిస్తున్నానని, అలాగని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే తానేంటో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరికలు చేశారు.

డైమండ్ బాబు ఒంటెత్తు పోకడలు విరమించుకోవాలి

◆ వైసీపీ సమన్వయకర్తపై సొంత పార్టీ నేతల నిరసన గళం ◆ బీసీలకు అవమానం..భజనపరులకే పదవులంటూ ఆగ్రహం



డైమండ్ బాబుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న నియోజకవర్గ వైసీపీ నాయకులు

తాడికొండ, మే 18(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఒంటెత్తు పోకడలు మానుకోవాలని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు విమర్శిస్తున్నారు. డైమండ్ బాబు చర్యలను నిరసిస్తూ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ పరిరక్షణ కమిటీగా ఏర్పడి గుంటూరులో ఆదివారం సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ డైమండ్ బాబు పార్టీ పదవులను తనకు భజన చేసిన వారికే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. బీసీలకు మండలాధ్యక్ష ఇవ్వమని కోరగా.. బీసీలు మండల అధ్యక్షులుగా పనిచేయగలరా అని.. బీసీల ముందే మాట్లాడి అవమానించారని అవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా డైమండ్ బాబు రాజధాని ప్రాంతంలో ఎన్నో సమస్యలున్నా.. స్పందించలేదని ఆరోపించారు. రాజకీయంగా ఇబ్బందులు పడుడుతున్న వారి తరుపున పోరాడకుండా.. భజన చేసే వారికే పదవులు ఇస్తారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష పదవుల్లో ఒకే సామాజికవర్గానికి మూడింటిని కేటాయించడాన్ని తప్పుబట్టారు. సీనియర్లకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన తెలిపారు. జిల్లా నాయకులకు డైమండ్ బాబుపై ఫిర్యాదులు చేసినప్పటికి ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పసుపులేటి వెంకట్రావు పద్మావతి, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, తాడికొండ ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, సుమారు 300 మంది నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రైల్వే గ్రూపు-బీ పరీక్షలు..!

● పరీక్షలతో ఆపరేటింగ్ సిబ్బంది మూకుమ్మడిగా సెలవులోకి
● వాళ్లలో ఎల్‌పీ, ఏఎల్‌పీ, గార్డులు తదితరులు
● వారంలో మూడు రోజులు రద్దవుతున్న ప్యాసింజర్ రైళ్లు

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు జరుగుతోన్న గ్రూపు-బీ పరీక్షలు కారణంగా వారంలో మూడు రోజల పాటు ప్యాసింజర్ రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల మొదటి వారంలో 3, 4, 5 తేదీల్లో ఎనిమిది రైళ్లను రద్దు చేయగా ఇప్పుడు 17, 18, 19 తేదీల్లో అవే రైళ్లను మళ్లీ రద్దు చేశారు. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రైళ్లను కొన్ని గంటల ముందు రద్దు చేస్తుండటంతో.. విషయం తెలియక రైల్వేస్టేషన్లకు వచ్చి నిరీక్షించి ఉసూరుమంటూ ప్రయాణికులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటికే ఆరు రోజుల పాటు రైళ్లను రద్దు చేశారు. ఇంతటితో అయిపోయిందా, ఇంకా రద్దులు ఉన్నాయా అన్న సమాచారం ఎవరికీ తెలియడం లేదు.


రద్దయిన రైళ్లు..

రైల్వేలో గ్రూపు-సీ హోదాలో ఉన్న ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి.. గ్రూ-బీ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ పరీక్షల కోసం లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లు, స్టేషన్ మాస్టర్లు, గార్డులు, టిక్కెట్ కలెక్టర్లు, క్లర్కులు, సేఫ్టీ, ఇతర ఇంజనీరింగ్ పోస్టుల్లో పని చేస్తున్న ఉద్యోగులు హాజరవుతున్నారు. దీంతో సిబ్బంది కొరత తలెత్తుతోందని.. రైల్వే శాఖ చెబుతూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తోంది. వాటిల్లో (57201) విజయవాడ-గుంటూరు, (57203) గుంటూరు - మాచర్ల, (57206) మాచర్ల- నడికుడి, (57205) నడికుడి - మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు - విజయవాడ, (67779) కాచీగూడ - నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లు ఉన్నాయి.

కూలీలు, విద్యార్థులకు ఇక్కట్లు

ఈ రైళ్ల రద్దుతో పల్లెల నుంచి పట్టణానికి, పట్టణం నుంచి వేరొక ప్రదేశానికి ఉదయం వెళ్లి పని చేసుకొని వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలానే విద్యార్థులు, ఆదివారం పోటీ పరీక్షలకు హాజరయ్యే వాళ్లు కూడా అవస్థలు పడుతున్నారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పరీక్ష రాసుకోవడానికి అనుమతి ఇచ్చేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లకు లేని ఇబ్బంది ప్యాసింజర్ రైళ్లకు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



మృతుడు రఫీ

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఉప్పలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ రఫీ(45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. రఫీ, లైన్‌మెన్ రాజశేఖర్ ఇద్దరూ నరసరావుపేట పట్టణ శివారు లోగల వల్లప్ప చెరువు వద్ద విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. రఫీ విద్యుత్ స్తంభంపై ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి.. కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.

నేటి నుంచి పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు (విద్య) మే 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. 4,254 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 27 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 971 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఎండల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉంచినట్లు డీఈఓ వెల్లడించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పటిష్టమైన భద్రత కల్పించినట్లు చెప్పారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయం

❖ మంత్రి నాదెండ్ల మనోహర్



సైనికుడి విగ్రహానికి పూలతో నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, రాజకుమారి

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన జై జవాన్ కార్యక్రమంలో పాల్గొని, సైనికుని విగ్రహానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి స్ఫూర్తిగా నిలిచిన సైనికులకు వీరతిలకం దిద్ది పూలతో అభిషేకం చేశారు. ఐరన్ స్క్రాప్‌తో విగ్రహాన్ని తయారు చేసిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. గ్యాలరీలో రూపొందించిన ఛత్రపతి శివాజీ, భరతమాత విగ్రహాలను ఆవిష్కరించారు. గ్యాలరీలో శిల్పాలను సందర్శించారు.

వేడుకగా బాల ఏసు దేవాలయ వజ్రోత్సవాలు



దేవాలయాన్ని పునఃప్రతిష్ఠించి గ్రామ క్రైస్తవులకు అంకితం చేస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో ఉన్న బాల ఏసు దేవాలయం వజ్రోత్సవాలను ఆదివారం రెండవ రోజు వేడుకగా నిర్వహించారు. గ్రామ నిర్మాత శ్రీ అరుళానంద స్వామి తిరునాళ్ల సందర్భంగా 125 వసంతాల మహోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య రాత్రి పునఃప్రతిష్ఠించి, దేవాలయంలోని స్వరూపాలను ఆశీర్వదించారు. తాళ్ళచెరువు గ్రామ క్రైస్తవులకు అంకితం చేశారు. తాళ్ళచెరువు విచారణ గురువు డాక్టర్ పుట్టి అంతోని రాజు, 50 మంది గురువులు, 70 మందికి పైగా కన్య స్త్రీలతో పాటు పలు గ్రామాల్లోని క్రైస్తవులు ఈ జూబ్లీ వేడుకలకు హాజరయ్యారు.

మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం



❖ శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి

రెంటచింతల,మే 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టతనిస్తూ.. అతివలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైందని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలలు తెరిచే సరికి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలకులకు భిన్నంగా.. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి పథకం వర్తింపజేయడం విశేషమన్నారు. రాబోయే రోజుల్లో మూడు సిలిండర్లకు ఒకేసారి నగదు జమ చేయబోతున్నారని చెప్పారు. అలాగే అన్నదాతల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచి.. పేదల నడ్డి విరగొట్టిందని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టి గల నేత కావడం వల్లనే ఒక్కొక్కటిగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య నేత కొత్త అంజి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపికలు

మంగళగిరి సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. 15 మంది మహిళా పవర్ లిఫ్టర్లు, 11 మంది పురుష లిఫ్టర్లను సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్విప్డ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి జూన్ రెండో తేదీ వరకు ఒంగోలులో జరిగే



ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌డీ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.

ఇరుకుటుంబాల ఘర్షణ: ఒకరి మృతి

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిపాడు గ్రామానికి చెందిన ఫిరంగుల కోటేశ్వరరావు(40), కోట్ల అంజి ఇద్దరూ ఒకే వీధిలో ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. అంజికి చెందిన గొర్రెల వల్ల కోటేశ్వరరావు ఇంటి పరిసరాలు అపరిశుభ్రం అవుతున్నాయని కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఇదే విషయంలో ఇద్దరికీ ఘర్షణ జరిగింది. అంజి కర్రతో కోటేశ్వరరావు తలపై గట్టిగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరులోనే కేరళ పంచకర్మ వైద్యసేవలు

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడి

గుంటూరు మెడికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన పని లేదని, కేరళ వారి అనుబంధంతో అన్ని సదుపాయాలతో కూడిన వంద పడకల ఆయుర్వేదిక్ హాస్పిటల్స్‌ను గుంటూరులోనే అందుబాట్లోకి తెచ్చినట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఆయుర్వేద వైద్యశిబిరంలో ఆయన ప్రసంగించారు. ఆయుర్వేదం ప్రాచీన వైద్యమని, దీని ద్వారా పలు రకాల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించవచ్చని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు వైద్య బృందం డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మౌనిక, తదితరులు రోగులను పరీక్షించారు. మోకాళ్ల నొప్పుల తో బాధపడుతున్న వారికి పంచకర్మ థెరపిస్టులతో అభ్యంగం అక్కడే చేయించారు. బీపీ, షుగర్ పరీక్షలు జరిపారు. శిబిరంలో సుమారు 150 మంది వైద్యసేవలు పొందగా, వీరికి రూ.90 వేలు విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.శివ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ టీ చిన్న పోలిరెడ్డి, తల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవ విజయవంతానికి సహకరించండి

● గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి అందరి సహకారం కావాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రధానమంత్రి మోదీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యోగా అభివృద్ధికి ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆస్పా భారత్ జాతీయ వైస్ ప్రెసి డెంట్ డాక్టర్ ముంజంపల్లి శివకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మోదీ ఫిట్‌నెస్ మంత్రపై అవగాహన కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారుల, సేవా సంస్థల మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాల య సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, లైబ్రేరియన్స్ కొండా చిన్నపరెడ్డి, నంద్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

హెచ్ఐవీ నిర్మూలన దిశగా ముందడుగు

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి

● ఘనంగా క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

గుంటూరు (మెడికల్), మే 18: హెచ్ఐవీ నిర్మూలన దిశలో గణనీయమైన పురోగతి సాధించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. వరల్డ్ క్యాండిలైట్ మెమోరియల్ డే పురస్కరించుకొని ఆదివారం రాత్రి హిందూ కళాశాల కూడలి వద్ద ఏర్పాటు చేసిన కొవ్వొత్తుల ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, హెచ్ఐవీ నివారణపై పని చేసే స్వచ్ఛంద సంస్థల సభ్యులు వెలుగుతున్న కొవ్వొత్తులను చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రమేష్ హాస్పిటల్, నగరంపాలెం మీదుగా ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు సాగింది. అనంతరం కూడలి లో మానవహారంగా ఏర్పడ్డారు. ఎయిడ్స్ మృతులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎయిడ్స్‌తో మృతి చెం దిన వారికి నివాళులర్పించేందుకు 1983వ సంవత్సరం నుంచి క్యాండిలైట్ మెమోరియల్ డే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలో 150 దేశాల్లో ప్రతి ఏటా మే మూడో ఆది వారం నాడు వరల్డ్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఐసీటీసీ కేంద్రాల జిల్లా సమన్వయకర్త జే వీరాస్వామి, షిప్ అధ్యక్షురాలు ఏ రమాదేవి, కొత్తపేట మహిళ మండలి, మారుతీ మహిళ సొసైటీ, వీహెచ్ఎస్, సర్థాస్ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు పాల్గొన్నారు.


ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

పాతగుంటూరు శ్మశాన వాటిక రోడ్డులో ఆక్రమణలు

● రహదారిపైనే వాహనాల మరమ్మతులు

● పట్టించుకోని అధికారులు, పాలకులు

గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): పాతగుంటూరు శ్మశాన వాటిక రహదారి ఆక్రమణలతో ఇరుకుగా మారుతోంది. వాహనదారులు, పాదచారులు వెళ్లడానికి ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. నడిరోడ్డుపైనే వాహనాల రిపేర్లు, రెండు వైపులా ఆక్రమణలతో దారి కుచించుకుపోయింది. అటుగా రాకపోకలు సాగించాలంటేనే స్థానికులకు పెద్ద నరకప్రాయంగా మారింది. ఇక అంత్యక్రియలకు వెళ్లేవారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే ఘర్షణలు పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతగుంటూరు హిందూ శ్మశాన వాటిక రోడ్డులో ఆక్రమణలు మితిమీరిపోయాయి. గతంలో పలుసార్లు ఫిర్యాదులు చేయటంలో అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించారు. కొంత పర్వాలేదు అనుకున్న తరుణంలో ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితికి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. నడిరోడ్డుపైనే ఆటోలు, ద్విచక్రవాహనాల రిపేర్లు చేయటం, రోడ్డుపైనే పార్కింగ్‌లు చేయటంతోనే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు మీదే వాహనాలకు మరమ్మతులు చేస్తున్న చిత్రం


శ్మశానంలోకి వెళ్లే దారిలో పార్కింగ్ చేసిన వాహనాలు


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఆవోపా నాయకులు

ఆవోపా ఆధ్వర్యంలో వృద్ధులకు పింఛన్ల పంపిణీ

గుంటూరు(విద్య), మే 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు స్థానిక అరండల్‌పేటలోని ఆవోపా కార్యాలయంలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత వసతి కల్పించి శిక్షణ అందిస్తున్న ట్లు, జూలైలో 50 లక్షల రూపాయలు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆవొప యూనిట్ల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈనెల పెన్షన్‌కు 60 వేల రూపాయలు చలువాది ఆది నారాయణ విరాళం అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవొప కార్యదర్శి రాధాకృష్ణయ్య ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంక ట్రావు, మట్టుపల్లి రవికుమార్, నాళం కృష్ణకుమారి, రంగా రత్నశ్రీ, మద్ది కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● ఆర్‌వీ నరసింహారావు


మాట్లాడుతున్న నరసింహారావు, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కార్మి కుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి(సీఐటీయూ) ఆర్‌వీ నరసింహా రావు డిమాండ్ చేశారు. పాతగుంటూరు, సీఐటీయూ జిల్లా కార్యాల యంలో ఆదివారం జరిగిన సంఘం జిల్లాకమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించక పోవ డంతో ప్రమాదాలు, చనిపోతున్న కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాల ని కోరుతూ దశల వారీ ఆందోళనలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. యూనియన్ రాష్ట్ర మహాసభలను గుంటూరులో జూలై 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణాల కు ఆటంకంగా ఉన్న లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ఉద్యోగ భద్రతకు ప్రమా దకరంగా ఉన్న జీవో నెంబర్ 20ని రద్దు చేయాలన్నారు. సమావేశానికి బి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో బీ లక్ష్మణరావు, కే శ్రీనివాసరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

నేటి నుంచి 4 రోజుల పాటు నులకపేట రైల్వేగేటు మూసివేత

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి 22వ తేదీ వరకు మంగళగిరిలోని నులకపేట - బ్రహ్మానందపురం మధ్యన ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేటుని మూసేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ట్రాఫిక్‌ని రోడ్డు అండర్ బ్రిడ్జీ నంబరు. 524 కిందగా మళ్లించడం జరుగుతుందన్నారు. వాహనదారులు, పాదచారులు ఈ విషయాన్ని గమనించి రైల్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సృష్టి, స్థితి, లయకారుడు 'విశ్వకర్మ' భగవానుడు

● ప్రొఫెసర్ చంద్రపాటి నాగవరప్రసాద్

గుంటూరు(తూర్పు), మే 18 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడు సృష్టి, స్థితి, లయకారుడుగా ఉంటూ సకల దేవతలచే ఆరాధింపబడుతున్నారని ఉత్కల్ విశ్వవిద్యాలయం, సంస్కృత విశ్రాంత విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రపాటి నాగవరప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశీ య విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీతారాంనగర్, వికాస తరంగిణి సేవా భవనంలో ఆదివారం విశ్వబ్రాహ్మణులు విశ్వ కర్మల మూలాలు, ప్రపంచ నాగరికతలో విశ్వకర్మల పాత్రపై మేధో మదన సదస్సు నిర్వహించారు. సభకు దేశీయ విశ్వబ్రాహ్మణ సేవాసం ఘం అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస సుధాకర్‌బాబు అధ్యక్షత వహిం చాడు. ధర్మపీఠం రాష్ట్ర సంచాలకులు తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు మాట్లాడుతూ వైశ్యకర్మలు పంచ వృత్తుల కంటే అనాది కాలం నుంచే మనిషి వేద సంస్కృతి జీవన విధానంగా ఉండే వారన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంపని రాధాకృష్ణ మూర్తి, కేఎన్‌వీ ప్రసాద్, పోలీస్ అధికారి ముళ్ళపూడి రాజా, ఇంజనీ ర్లు కందుకూరి వెంకట్రావు, అత్తలూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగ వరప్రసాదు, పాల్గొన్న విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు

21 నుంచి శ్రీనివాసరావుతోటలో హనుమత్ జయంతి

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాసరావుతోటలో ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమౌతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న అంకురార్పణ, 22న స్వామి వారి కల్యాణం, 23న హోమం, 24న పురవీధుల్లో స్వామి వారి రథోత్సవం, 25న సింధూర పూజ, 26న అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

22న బొంగరాలబీడు మహాప్రస్థానంలో..

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22న బొంగరాల బీడులోని మహాప్రస్థానంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆదివారం పేర్కొన్నారు. గురువారం ఉదయం 6 గంటలకు హోమం, 7 గంటలకు అభిషేకం, 9 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణ, 10 గంటలకు రామ నామ భజన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఊరేగింపుగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలు

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలో శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణానికి ఊరేగింపుగా పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువెళ్లారు. భద్రావతి సమేత భావనరుషి స్వామి ఆలయం నుంచి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు.

పొగాకు కొనని కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు


పొగాకు పంటను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఆదేశాలు అమలు జర పని పొగాకు కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కొత్తమల్లాయపాలెం, పాత మల్లాయపాలెం, తిమ్మాపురం, పల్లపాడు, సొపాడు, చమళ్ళ మూడి, వింజనంపాడు గ్రామాల్లో రైతు సం ఘం నాయకులు పర్యటించి పొగాకు రైతులను కలసి వారి సమస్యలు, కంపెనీలు వ్యవహరిస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి నల్లబర్లీ పొగాకును క్వింటాల్ రూ.12,500లకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని చెప్పినప్పటికి, కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. సీఎం ఆదే శాలను ధిక్కరించిన కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కంపెనీలు ముందుకు రాక పోతే ప్రభుత్వమే ఏజెన్సీల ద్వారా నిరుడు చెల్లించిన ధరలకే కొనుగోలు చేయాలని కోరారు. ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలపై జూన్ 2న సీఎం క్యాంపు కార్యాలయం ఎదుట జరిగే ఆందోళనల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి రంగారెడ్డి, పీపీ జగన్నాథం పాల్గొన్నారు.


ఆందోళనకు సంఘీభావం ప్రకటిస్తున్న ఫ్యాప్టో నాయకులు

21న ఫ్యాప్టో ఆధ్వర్యంలో డీఈ కార్యాలయం ముట్టడి

గుంటూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముట్టడిస్తామని సంఘం నాయకులు ప్రకటించారు. ఆదివారం జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కె.బసవలింగారావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117 రద్దు చేస్తామని ప్రభు త్వం హామీ ఇచ్చి అంతకన్నా ప్రమాదకరమైన జీవో 19, జీవో 21లు విడుదల చేసి 9రకాల పాఠశాలల వ్యవస్థను రూపొందించాలని పూనుకోవడం ఉపాధ్యాయ లోకాన్ని మోసం చేయడమేనని ఆరోపించారు. గత ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటినే కొనసాగిస్తూ, ఇంకా ప్రమాదకర విధానాలను అమలు చేయపూనడం సరికాదన్నారు. జీవో 117అమలుకు పూర్వ స్థితినే అమలు చేయా లని కోరారు. ఐక్యవేదిక నాయకులు ఎం కళాధర్, డీకే సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఐక్యంగా తిరుగుబాటు చేయకుండా బదిలీల్లో ఒక్కొక్కరికి ఒక్కో సమస్యను ప్రభుత్వం సృష్టించి విభజించు పాలించు అనే విధంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఎస్‌జీటీల ను ఇవ్వాలని, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:20గా ఉండాలన్నారు. ఉన్నత పాఠశాలలో 1:43గా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి ఉండాలన్నారు. సమావేశంలో పాల్గొన్న గుంటూరు జిల్లా నాయకులు జీవీ రాజు, యూ రాజశేఖరరావు, మహమ్మద్ ఖాలీద్, కే శ్రీనివాసరావు, కొండయ్య, రెహమాన్, పల్నాడు జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా ప్రతినిధులు ఏ శ్రీనివాసరావు, జ్ఞానేశ్వరరావు, మూర్తి, లక్ష్మీనారాయణ, జి.వెంకటేశ్వరరావు, దాస్, శివన్నారాయణ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం గొప్ప వరం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌కుమార్


విలేకరులతో మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించటం గొప్ప వరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను వరుస క్రమంలో అమలు చేస్తుందని చెప్పారు. రైతులకు 20000 ఆర్థిక సాయం, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి 15000 ఇవ్వడానికి జూన్ నెలలో ప్రణాళికలు సిద్ధం చేసి నట్లు తెలిపారు. ఇప్పటికే ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నట్టు ఆయన వెల్లడించారు అంతేకాక ప్రాజెక్టుల నిర్వహణ మరమ్మతులకు మరో రూ.34 4కోట్లు ప్రభుత్వం కేటా యించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుంటే చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని సురేష్ కుమార్ విమర్శించారు. వైసీపీ నాయకులు కళ్ళు తెరచి చూడాలని హితవు పలికారు.

మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ తేజ సూచించారు. ఇలా నమోదైన అర్జీల స్థితి తెలుసుకోవాలంటే 1100 నం బరుకి కాల్ చేయొచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథాతథంగా సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో జరుగు తుందని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్థంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో.. సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.



పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నిమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడీన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.

ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.



సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఏం జరిగింది?: విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

యూట్యూబ్‌లో చూసి..: సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కీవ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కీవ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

చిత్రజ్యోతి

SINCE 1965

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.



ఆలయ రక్షణ కోసం..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతిలాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

\- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

కొప్పర్రు టీడీపీ అధ్యక్షుడిగా గోపీప్రసాద్



యేలూరి గోపీప్రసాద్

పెదనందిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొప్పర్రులో ఆదివారం టీడీపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్న యేలూరి గోపీప్రసాద్‌ను మరలా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా షేక్ బాజావలి, మరో ముగ్గురు ఆర్గనైజింగ్ సెక్రటరీలను, మరో ముగ్గురు సెక్రటరీలు, ఒక కోశాధికారిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బత్తిని వేణు, మాజీ జడ్పీటీసీ బత్తిని శారద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 4 రోజుల పాటు నులకపేట రైల్వేగేటు మూసివేత

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి 22వ తేదీ గురువారం వరకు మంగళగిరిలోని నులకపేట - బ్రహ్మానందపురం మధ్యన ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేటుని మూసేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ట్రాఫిక్‌ని రోడ్డు అండర్ బ్రిడ్జీ నంబరు. 524 కిందగా మళ్లిస్తారన్నారు. వాహనదారులు, పాదచారులు ఈ విషయాన్ని గమనించి రైల్వే వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజ సూచించారు. ఇలా నమోదైన అర్జీల స్థితి తెలుసుకోవాలంటే 1100 నంబరుకి కాల్ చేయొచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథాతథంగా సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో జరుగుతుందని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా లక్ష మల్లెల పూజ

పెదనందిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం దేవస్థాన ఆవరణలో మహిళలు లక్ష మల్లెల పూజ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

20న జరిగే నిరసనను జయప్రదం చేయాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు

తాడేపల్లి(ఇప్పటం), మే 18(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై మే 20న జరుగు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు చట్టరూపం తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. రైతు సంఘం మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మిర్చి, పొగాకుకు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. రైతుల నడ్డి విరిచేందుకు కార్పొరేట్ వ్యవసాయం ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, వాటిని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో స్థానిక సమస్యలపై మే 20న నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోదుగుల శ్రీనివాసరెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం గొప్ప వరం

● కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించటం గొప్ప వరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరుస క్రమంలో అమలు చేస్తుందని చెప్పారు. రైతులకు రూ.20వేల ఆర్థిక సాయం, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి 15వేలు ఇవ్వడానికి జూన్ నెలలో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అంతేకాక ప్రాజెక్టుల నిర్వహణ మరమ్మతులకు మరో రూ.34 4కోట్లు ప్రభుత్వం కేటాయించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుంటే చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారని సురేష్ కుమార్ విమర్శించారు. వైసీపీ నాయకులు కళ్ళు తెరచి చూడాలని హితవు పలికారు.

రేపు తెనాలిలో మినీమహానాడు

తెనాలిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో మంగళవారం నియోజకస్థాయిలో మినీ మహానాడును నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులు, తెలుగుమహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కలగానే స్వచ్ఛ భారత్ ఆశయం

● మూలకు చేరిన చెత్త సేకరించే రిక్షాలు
● గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించని తీరు
● పట్టించుకోని అధికారులు, పాలకులు

తాడికొండ, మే 18(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో చెత్త సేకరణ రిక్షాలు మూలకు చేరాయి. ముళ్లపొదల్లో పెరిగిన చెట్ల మధ్య, వాటర్ ట్యాంకు కింద దర్శనమిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలకు జనాభా ఆధారంగా రిక్షాలు పంపిణీ చేశారు. ఇళ్ల సంఖ్య ఆధారంగా గ్రీన్ అంబాసిడర్లను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే రిక్షాలు సక్రమంగా వినియోగించకపోవటంతో రిక్షాలు తప్పుపట్టి పూర్తిగా పాడైపోయాయి. గతంలో ప్రతిరోజు ఆయా గ్రామాల్లో ఇళ్లకు వచ్చి చెత్తను సేకరించే గ్రీన్ అంబాసిడర్లకు సక్రమంగా జీతాలు రాకపోవటంతో కొంత మంది గ్రీన్ అంబాసిడర్లు పనిలోకి రాకుండా ఆగిపోయారు. దీంతో చెత్తను సేకరించే రిక్షాలు నిరుపయోగంగా మారాయి. కాగా వేలాది రూపాయలతో కొనుగోలు చేసిన రిక్షాలు తప్పుపట్టి పనికి రాకుండా పోవటంతో పాటు, ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే పని నిలిచిపోయిం ది. తాడికొండలో గతంలో ప్రతి రోజు ఇంటింటికి చెత్తను సేకరించేవారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామస్థు లు ఇంట్లోని వ్యర్థాలను బయట పడేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్తను వేయటానికి కుండీలు కూడా కన్పించటం లేదు. వేలాది రూపాయాలతో కొనుగోలు చేసిన రిక్షాలను బాగు చేయించి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తలను వేరు వేరు చేస్తే మంచి ఫలితం ఉంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైన అధి కారులు, పాలకులు స్పందించి రిక్షాలను వినియోగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.



బేజాత్‌పురంలో మూలకు చేరిన రిక్షాలు



రావెలలో వాటర్ ట్యాంకు కిందకు చేరిన చెత్తను సేకరించే రిక్షాలు

సమైక్యతకు చిహ్నంగా తిరంగా యాత్ర

● భారత సైన్యానికి సంఘీభావం తెలిపిన ప్రజలు
● గాలిగోపురం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ
● వీరమరణం పొందిన సైనికులకు నివాళులు

మంగళగిరి సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైన్యానికి సంఘీభావంగా ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ సమైక్యతకు చిహ్నంగా నిలిచింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో గాలిగోపురం నుంచి మెయిన్ బజారు మీదుగా పాత కూరగాయల మార్కెట్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. దేశ శౌర్య పరాక్రమాలను చాటిన సైనికులు, త్రివిధ దళాలకు సంఘీభావంగా నిర్వహించిన తిరంగా ర్యాలీకి ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభించింది. కూటమి శ్రేణులు, ప్రజలు, మాజీ సైనికులు జాతీయ పతాకాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తగిన గుణపాఠం చెప్పిందన్నారు. భారత సైనిక దళాలకు దేశం యావత్తూ రుణపడి ఉందన్నారు. భారత్ జోలికి వస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, వ్యాపారులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు, కూటమి శ్రేణులు

మేడికొండూరులో..

మేడికొండూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరులో ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావం తెలియజేస్తూ కూటమి నాయకులు తిరంగా యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబట్టి మేడికొండూరు సెంటర్ నుంచి మండల కార్యాలయాల వరకు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాషా, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మలిపెద్ది రమేష్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రాచర్ల నాగబాబు, నియోజకవర్గ జనసేన మీడియా కన్వీనర్ కందుల సైదయ్య, నాయకులు బర్కత్ అలీ, టీడీపీ నాయకులు పొందూరు శివ, పాములపాటి యల్లమంద, బీజేపీ నాయకు లు ఆమతి వెంకటరమణ, చేకూరి వెంకటేశ్వరరావు, నెలకుదిటి గోపి, దాసరి శేషగిరిరావు తదితరులు, ప్రజ లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

పొగాకు కొనని కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు



పొగాకు పంటను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఆదేశాలు అమలు జరపని పొగాకు కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కొత్తమల్లాయపాలెం, పాత మల్లాయపాలెం, తిమ్మాపురం, పల్లపాడు, సౌపాడు, చమళ్ళమూడి, వింజనంపాడు గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి పొగాకు రైతులను కలసి వారి సమస్యలు, కంపెనీలు వ్యవహరిస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి నల్లబర్లీ పొగాకును క్వింటాల్ రూ.12,500లకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని చెప్పినప్పటికీ, కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. సీఎం ఆదేశాలను ధిక్కరించిన కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కంపెనీలు ముందుకు రాకపోతే ప్రభుత్వమే ఏజెన్సీల ద్వారా నిరుడు చెల్లించిన ధరలకే కొనుగోలు చేయాలని కోరారు. ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలపై జూన్ 2న సీఎం క్యాంపు కార్యాలయం ఎదుట జరిగే ఆందోళనల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి రంగారెడ్డి, పీవీ జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన




రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

తాడికొండ, మే 18(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని నార్త్ స్కూల్లో టీడీపీ నాయకులు ఎడ్డూరి ప్రసన్నబాబు, కనగాల కళ్యాణ్‌చంద్ (బాబీ) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తుళ్లూరుకు చెందిన హాసిని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 48 మందికి శుక్లాల ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శామ్యూల్, వైద్యులు సునీల్, హుస్సేన్, హేమ, ప్రియాంక, ఇందు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారు

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

తాడికొండ(పొన్నెకల్లు), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న దేశ సంపదను తన అనుచరులకు దోచిపెడుతున్నాడని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్ష నిర్వహించారు. కార్యక్ర మానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అజయ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కబంధ హస్తాల్లో ప్రధాని మోదీ చిక్కుకున్నారన్నారు. దేశ సంపదను అదాని, అంబానీ, మరో 28 మంది కుబేర్లకు దోచిపెడుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య నానాటికి పెరుగుతుందని తెలిపారు. ఉగ్రవాదాన్ని అన్నిపార్టీలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబరు 9, 10, 11 తేదీల్లో చండిఘర్ లో సీపీఐ జాతీయ మహాసభలు జరుగుతాయని, ఆగస్టు 23, 24, 35 తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర సభలు జరుగుతున్నాయని, అలాగే ఆగస్టు 23, 24 తేదీల్లో గుంటూరు జిల్లా మహాసభలు జరుగుతాయని తెలిపారు. అడ్డ రోడ్డుని పున్నమ్మచెరువు స్థలం విషయమై ఈ నెల 21న విచారణ జరుగుతుందని అన్ని పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, రామినేని రామారావు, తోకల అనురాధ, కోట భూపతిరావు, దామినేని పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం జరుపుతున్న అర్చకులు

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వైకుంఠపురంలో శ్రీనివాసుడి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణం చేశారు. అలంకరించిన వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ఈవో అనుపమ, శ్రీనివాసవర్మ దంపతులు కల్యాణం జరిపించారు. కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలువురు ప్రముఖులు కల్యాణంలో పాల్గొన్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఊరేగింపుగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలో శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణానికి పద్మశాలీ సంఘం సభ్యులు ఊరేగింపుగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువెళ్లారు. మెయిన్ రోడ్డులోని భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయం నుంచి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. పద్మశాలీ సంఘం సభ్యులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పూలు, పండ్లు, కల్యాణ సామగ్రితో మెయిన్ రోడ్డు, బోసురోడ్డు మీదుగా వైకుంఠపురం ఆలయం వరకు ఊరేగింపు చేశారు. కల్యాణ సామగ్రిని ఆలయ అర్చకులకు అందజేశారు. జొన్నాదుల మహేష్, గుంటి వెంకట్, తిరువీధుల సాంబశివరావు, పంచుమర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న పద్మశాలీ సంఘ సభ్యులు

గుంటూరులోనే కేరళ పంచకర్మ వైద్యసేవలు

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన పని లేదని, కేరళ వారి అనుబంధంతో అన్ని సదుపాయాలతో కూడిన వంద పడకల ఆయుర్వేదిక్ హాస్పిటల్స్‌ను గుంటూరులోనే అందుబాట్లోకి తెచ్చినట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం అగతవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఆయుర్వేద వైద్యశిబిరంలో ఆయన ప్రసంగించారు. ఆయుర్వేదం ప్రాచీన వైద్యమని, దీని ద్వారా పలు రకాల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించవచ్చని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు వైద్య బృందం డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మౌనిక తదితరులు రోగులను పరీక్షించారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి పంచకర్మ థెరపిస్టులతో అభ్యంగం అక్కడే చేయించారు. బీపీ, షుగర్ పరీక్షలు జరిపారు. శిబిరంలో సుమారు 150 మంది సేవలు పొందగా, వీరికి రూ.90 వేలు విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.శివకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న పోలిరెడ్డి, తల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల శ్రేయస్సు కోసమే క్రియాశీల సభ్యత్వం

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



జనసేన క్రియాశీల వలంటీర్లకు సభ్యత్వ కిట్లను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

మంగళగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్తల శ్రేయస్సు కోసమే క్రియాశీల సభ్యత్వాలను నమోదు చేస్తున్నట్టు ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జనసేన మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం జనసేన క్రియాశీల వలంటీర్లకు సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేశారు. చిల్లపల్లి మాట్లాడుతూ జనసేన వలంటీర్లు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేస్తున్న మంచి పనులను ప్రతి ఇంటికి తీసుకువెళ్లి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. జనసైనికులు ఆపదకాలంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదని భావించి కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచేందుకు క్రియాశీల సభ్యత్వాన్ని మహాసంకల్పంగా చేపడుతున్నట్టు చెప్పారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదనరావు, జనసేన నేతలు బడే కోమలి, సామల నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మురళీకృష్ణ, మేడిశెట్టి కిశోర్, బల్లా ఉమామహేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, షేక్ వజీర్ బాషా, కొడాలి నాగమల్లేశ్వరరావు, కట్టా కృష్ణ, చిట్టెం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసరస్వతీదేవిగా శ్రీమహంకాళీ అమ్మవారు

● వైభవంగా చండీహోమం



శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం 48వ పునః ప్రతిష్ఠ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అమ్మవారు శ్రీసరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో పలువురు దంపతులతో శ్రీచండీ హోమం జరిపించారు. కృష్ణచైతన్య నేతృత్వంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, తారక్‌నాథ్‌శర్మ, మణిశర్మలు దంపతులతో పూజలు జరిపించారు. కేఆర్ కొండూరు నుంచి ఊరేగింపుగా తరలివచ్చి, అమ్మవారికి సారెను సమర్పించారు. హోమంలో పాల్గొన్న దంపతులతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వమే పొగాకును కొనుగోలు చేయాలి

● రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కంచుమాటి అజయ్‌కుమార్

పెదనందిపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం పొగాకు కొనుగోలు చేయాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ శాతం భూమి సాగుచేస్తున్నది కౌలు రైతులేనని, అధిక వడ్డీలు తెచ్చి ఈఏడాది పొగాకును సాగుచేశారని, మద్దతు ధర లేకపోవడంతో పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రైతు సంఘ నాయకులు ఆందోళన మేరకు ప్రభుత్వం కంపెనీలు, సంఘ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో చర్చలు జరిపారని, అయినప్పటికీ కనీసం కేజీ పొగాకు కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వం చర్చలు జరిపిన 8కంపెనీల ద్వారా కొనుగోలు చేయించాలని లేని పక్షంలో లైసెన్సులు రద్దు చేయడంతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీని నిలుపుదల చేయాలన్నారు. ఈ నెల 20న పొగాకుకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపడతామని ఈ కార్యక్రమంలో రైతులు, ఆయా సంఘ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కరించకుంటే సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కాపు వెంకటసుబ్బారావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగా డే విజయవంతానికి సహకరించండి

● గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి అందరి సహకారం కావాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రధానమంత్రి మోదీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యోగా అభివృద్ధికి ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆస్సా భారత్ జాతీయ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ముంజంపల్లి శివకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మోదీ ఫిట్‌నెస్ మంత్రపై అవగాహన కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారుల, సేవా సంస్థల మద్దతు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాల య సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, లైబ్రేరియన్స్ కొండా చిన్నపరెడ్డి, నంద్యాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైల్ నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందటంపై కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేపల్లె రైల్వేస్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు భట్టిప్రోలు రైల్వేట్రాక్ దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి (27) రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా గుర్తించామన్నారు. నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు తెనాలి జీఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

రేపు తెనాలిలో మినీమహానాడు

తెనాలిరూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): తెనాలిలో మంగళవారం నియోజకస్థాయిలో మినీ మహానాడును నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమంలో కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


ఆంజనేయస్వామికి అరటిపండ్ల అలంకరణ

హనుమజ్జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని శివాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గత నెల 12 నుంచి లక్ష ప్రదక్షణ మహాయజ్ఞం చేపట్టారు. ఈ నెల 22వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. దక్షిణ ముఖ వీరాంజనేయస్వామికి ఆదివారం అరటిపండ్లతో పూజచేశారు. హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గ్రంధిసేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు శశి ఉత్సవాలలో పాల్గొన్నారు.

రేపటి నుంచి దాసాంజనేయ స్వామి జయంతి వేడుకలు

తెనాలి, మారీసుపేట,మే 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి శ్రీ దాసాంజనేయ స్వామివారి జయంతి వార్షికోత్సవాలను పెనుగొండ పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు శ్రీవిద్యాపీఠం ట్రస్ట్ సభ్యులు తెలిపారు. 20వ తేదీ మంగళవారం స్వామివారికి లక్ష నాగవల్లిదళ అర్చన, 21న 1108 అరటిపళ్లతో, 22న 1108 మామిడిపండ్లతో ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిత్యం విశేష అభిషేక సిందూర అర్చన, హారతులను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముద్దాభక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట,మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని వేసవి చలివేంద్రంలో శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవాసమితి సభ్యులు పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఆదివారం శివలింగేశ్వరస్వామి భక్త బృందం ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మునిపల్లి వంశీ జన్మదినోత్సవం సందర్భంగా మిత్రబృందం పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎస్ భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో సభ్యులు ఎన్‌ఆర్‌కే శర్మ, షేక్ కాలేషా, సుభాని, మౌలాలి, శ్రీను, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వైఖానస సంఘానికి గోపాలకృష్ణ సేవలు: కేసన

తెనాలి అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): వైఖానస సంక్షేమ సంఘానికి ఆర్యన్ గోపాలకృష్ణ సేవలందించారని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. రామలింగేశ్వరపేటలో ఆదివారం ఆయన ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఆయన పేరుతో అవార్డులు వచ్చే ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రకటించారు. ఎం.శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేమూరి విజయభాస్కర్, నారాయణం వేణుగోపాల్, అనంతాచార్యులు, హరికృష్ణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘ వార్షికోత్సవం

తాలూకా హైస్కూల్ పూర్వవిద్యార్థుల సంఘ 10వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కొత్తపేటలోని పెన్షనర్ అసోసియేషన్ హాలులో బాల్యమిత్ర పేరుతో పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. జీఎస్‌టీ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పూర్వవిద్యార్థులు ఎప్పుడో ఒకసారి కలుసుకుంటారని కానీ మన సంఘం ప్రతి ఏటా సమావేశమయ్యేలా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వ్యక్తులకు సాయం చేయడం, సమాజంలో పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. గద్దె శంకర్, పాండురంగారావు, అన్నవరపు సురేష్, లోకేశ్వరరావు, శరత్, ప్రసాద్, సత్యనారాయణ పర్యవేక్షించారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన యంగ్ జనరేషన్ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీలో నిరుపేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు సంస్థ అధ్యక్షుడు షాదిక్ సభ్యులతో కలిసి బియ్యం, నిత్యావసరాలు అందించారు. అనంతరం కాలనీలో పేదలకు భోజనం పంపిణీ చేశారు. నవీన్, ధీరాజ్, సాయి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయాలుగా టిడ్కో నివాసాలు

○ మౌలిక వసతుల కోసం మూడేళ్లుగా ఎదురు చూపులు
○ విషపురుగులతో భయం భయంగా జీవనం
○ డ్రెయిన్లు లేక పారని మురుగుతో ఇక్కట్లు
○ సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారుల విన్నపం


బేస్‌మెంట్‌లోనే ఆగిన వాటర్ ట్యాంక్ నిర్మాణం


అధ్వానంగా ఉన్న టిడ్కో గృహ సముదాయాలకు వెళ్లే రహదారి

తెనాలి, మారీసుపేట,మే 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావస్తున్నా టిడ్కో నివాసాల గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. సమస్యల పరిష్కారానికి దృష్టిపెట్టే నాథుడే కనబడటం లేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం దాదాపు సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే మౌలిక వసతుల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గృహ సముదాయాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలకు నిలయాలుగా మారాయి. ఇంట్లో వినియోగించిన మురుగునీరు పారుదల లేక అపరిశుభ్ర వాతావరణంలో జీవించే పరిస్థితి నెలకొని ఉంది. రాకపోకలకు సరైన మార్గం కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు కూడా గ్రౌండ్ వాటర్‌నే వాడుకోవాల్సి పరిస్థితి. అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రైవేటు వాహనాన్ని ఆశ్రయించి సుమారు 5 కిలోమీటర్లు ప్రయాణించి జిల్లా వైద్యశాలను రావాల్సిన దుస్థితి. పిల్లల చదువులకు ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. పింఛన్‌లు రేషన్ సరుకులకు కోసం వేయికళ్లతో ఎదురు చూడాల్సిన పరిస్థితి.

11 వందల కుటుంబాలు నివసించేలా నిర్మాణాలు

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇచ్చే సదుద్దేశంతో టిడ్కో గృహాలను షేర్‌వాల్ టెక్నాలజీతో అధునాతన బహుళ అంతస్థుల భవనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సుమారు 11వందల కుటుంబాలు నివసించేలా నిర్మాణాలు జరిగాయి. కానీ మౌలిక సదుపాలైన వాటర్ ట్యాంక్, సైడు కాలువలు వంటి పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఎన్నికల కోడ్ సమీపించడంతో ఆ పనుల్లో జాప్యం నెలకొంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారం చేపట్టిన అనంతరం టిడ్కో గృహ సముదాయల పనులపై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైయింది. రోజులు గడుస్తున్న


టిడ్కో ఇళ్ల మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలు,

వాటి నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారి చిట్టడవిని తలపించాయి. అనంతరం హడావిడిగా పెండింగ్ పనులు పరిష్కరించకుండానే అప్పటి వైసీపీ ప్రభుత్వం రంగులు వేయించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. టిడ్కో ఇళ్లకు వెళ్లిన లబ్ధిదారులు విస్మయానికి గురయ్యే పరిస్థితి. గృహాలకు కనీసం విద్యుత్ సరఫరా, తాగునీరు, మురుగునీటి పారుదల, రాకపోకలకు, అత్యవసర వైద్యసేవలు వంటివి లేవు. ఆ సమస్యలపై అప్పటి ఎమ్మెల్యే, మునిసిపల్ అధికారులకు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా వారి నుంచి తగిన స్పందన లేదు. దీంతో ఒక్కొక్కరిగా టిడ్కో సముదాయాన్ని విడిచి పట్టణంలోని అద్దె ఇళ్లకు వెళ్లిపోయారు. 15 నుంచి 25 కుటుంబాల మినహా ఆ గృహాల్లో నివసించలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే తిరిగి టిడ్కో గృహ సముదాయాలకు మంచి రోజులు వస్తాయని ఆశాభావంతో సుమారు 500మంది లబ్ధిదారులు గృహ సముదాయాల్లో నివాసం ఉండేందుకు వచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ అక్కడ నెలకొన్న సమస్యలపై దృష్టి సారించకపోవటంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా టిడ్కో నివాస గృహాల్లోని ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టి సత్వరమే పరిష్కారానికి ముందుకు రావాలని కూటమి ప్రభుత్వానికి పలువురు లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మలి దశలో జీబీసీ రోడ్డు విస్తరణ పనులు

పొన్నూరు టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని జీబీసీ రోడ్డు విస్తరణపనులు పూర్తికావస్తున్నాయి. పొన్నూరులో జీబీసీ రోడ్డును విస్తరించాలని దశాబ్దకాలం క్రితం ప్రతిపాదనలు, అనుమతులు, నిధులు మంజూరయ్యాయి. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం ఓటమి చెందడంతో విస్తరణ పనులు అటకెక్కాయి. దీనిపై పలు విమర్శలు రావడంతో 2023లో ఎన్నికల ముందు హడావిడిగా వైసీపీ పాలకులు విస్తరణ పనులు ప్రారంభించారు. పొన్నూరు రూరల్ పోలీసుస్టేషన్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు ఉన్న 157 భవనాలను విస్తరణ పేరుతో తొలగించారు. బాధితులకు పరిహారం ఇవ్వకపోగా, రహదారి నిర్మాణాన్ని పూర్తిగా వదిలివేశారు. ధ్వంసమైన రహదారి పైనే ఏడాదికాలంగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమీక్షించి రహదారి వెంట ఉన్న భవన యజమానుల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల దెబ్బతిన్న రహదారిపై ఒక లేయర్ బీటీ రోడ్డు నిర్మించి ప్రజల అవస్థలను తాత్కాలికంగా అధికారులు తొలగించారు. అలాగే రహదారి వెంట పైప్‌లైన్ల నిర్మాణం కూడా పూర్తిచేశారు, ప్రస్తుతం రూరల్ పోలీసుస్టేషన్ నుంచి వీవర్స్ కాలనీ వరకు ఉన్న 2.5 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు పూర్తిచేసేలా పనులు జరుగుతున్నాయి. మరో వారం పదిరోజుల్లో జీబీసీ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసేలా అధికారులు పనులు చేయిస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న జీబీసీ రోడ్డు

బ్రాహ్మణ సంక్షేమం కోసం పరిషత్ కృషి

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ పరిషత్ కృషి చేస్తుందని అధ్యక్షుడు కోటా పార్థసారథి చెప్పారు. పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో సామూహిక ఉపనయనం కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు మెట్టా పార్థసారథి ఉపనయనం కార్యక్రమం నిర్వహించారు. పరిషత్ కార్యదర్శి సాయికిరణ్, కోశాధికారి రామచంద్రమూర్తి, శ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్, ధనుంజయ, ప్రవీణ్, సురేష్, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


రోగులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం కొల్లిపర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. శిబిరానికి వచ్చిన రోగులను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ క్యాంపులో సాధారణ శస్త్ర చికిత్సలు, స్త్రీ సంబంధిత విభాగం, చిన్నపిల్లల వైద్యపరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, దంతాలు, గుండెకు సంబంధిత మొదలగు విభాగాల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో ప్రధాన విభాగాలకు చెందిన 20మంది డాక్టర్లు, 50మంది ఆరోగ్యసిబ్బందితో వైద్యసేవలు అందించారు. మెగా మెడికల్ క్యాంపునకు మండల గ్రామాల నుంచి అనూహ్య స్పందన లభించిందని 822మంది వైద్యసేవలు పొంది ఉచితంగా మందులు తీసుకున్నారన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన వైద్యశాలకు పూర్వవైభవం వచ్చేలా అంకిత భావంతో ప్రతి ఒక్కరూ పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలలో అవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో తగిన మౌలిక వసతులు కల్పించి మెరుగైన వైద్యసేవలు అందించటానికి కృషి చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జీవీ రంగారావు, మెడికల్ ఆఫీసర్ భరత్, డాక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల


పాల ఉత్పత్తిదారుడికి పశుబీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి పాల సొసైటీ పరిధిలో పాల ఉత్పత్తిదారుడు ఓరుగంటి బాలకృష్ణకు ఆదివారం చైర్మన్ నరేంద్రకుమార్ పశుబీమా నగదు చెక్కు పంపిణీ చేశారు. ఓరుగంటి బాలకృష్ణకు చెందిన పాడి పశువు ఇటీవల మృతిచెందగా సంగం డెయిరీ పశు సంక్షేమ పథకం ద్వారా రూ.60,000 పరిహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంగం పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు, డెయిరీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బులియన్ మర్చంట్స్‌కు అండగా నిలుస్తాం..

బులియన్ మర్చంట్స్‌కు అన్నివిధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం పొన్నూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేని చింతలపూడిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బంగారు వర్తకులు నరేంద్రను సత్కరించారు. తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సంకా మల్లికార్జునరావు, కార్యదర్శి షేక్ అలీషా, కోశాధికారి ఎండీ ఖాసీం, మాజీ కౌన్సిలర్ మహ్మద్‌గౌస్, వెదుపర్తి లక్ష్మణమూర్తి, షేక్ బాబ్జీ, తాటికొండ సుధీర్ పాల్గొన్నారు.



గ్రామంలో ప్రచారం చేస్తున్న వెంకయ్య

ప్రభుత్వ పాఠశాలల కోసం దండోరా, మైకు ప్రచారం

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దండోరా, మైకు ప్రచారం చేపట్టారు ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య. రూరల్ మండలం సంగంజాగర్లమూడిలో నివసిస్తున్న ఆయన ప్రభుత్వం పిలుపునిచ్చిన బడి బాట కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తూ ఆదివారం గ్రామంలో మైకు ప్రచారం చేయడంతోపాటు ముఖ్యమైన కూడళ్లలో దండోరా కూడా వేయించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలలు నడుస్తాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను కాన్వెంట్‌లకు పంపి నగదు వృథా చేసుకోవద్దని కోరారు.

20నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

పొన్నూరు టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి పట్టణంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గద్దె అమరనాథ్ ఆదివారం తెలిపారు. 20వ తేదీన విశ్వక్సేన పూజ నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. 21న అభిషేకం, లక్ష తమలపాకుల పూజ, సాయంత్రం గ్రామోత్సవం, 22న హనుమత్ జయంతి సందర్భంగా పంచామృత అభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, లక్ష మల్లెల పూజ, సాయంత్రం 6గంటలకు సువర్చలా సమేత శ్రీవీరాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం, 23న దివ్య రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న జరిగే కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు ఆలయంలో సంప్రదించాల్సిందగా ఈవో అమర్నాథ్ సూచించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

తెనాలి అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): ఐతానగర్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుసాయం అందజేశారు. కృష్ణవేణి వాటర్ ప్లాంటు నిర్వాహకులు మల్లెబోయిన నాగరాజు సహకారంతో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఫరీద్, లక్ష్మీమాధురిలకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు అందజేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం ప్రసూనదేవి, బెల్లంకొండ వెంకట్, ఉమాశంకర్, కమిటీ చైర్మన్ కిరణ్, సింహాద్రి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

తెనాలి అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వైకుంఠపురంలో శ్రీనివాసుని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కల్యాణం చేశారు. అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ఈవో అనుపమ, శ్రీనివాసవర్మ దంపతులు కల్యాణం జరిపించారు. కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ప్రముఖులు కల్యాణంలో పాల్గొన్నారు.


కల్యాణం జరుపుతున్న అర్చకులు

ఊరేగింపుగా పట్టువస్త్రాలు, తలంబ్రాలు

వైకుంఠపురంలో శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణానికి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మెయిన్ రోడ్డులోని భద్రావతి సమేత భావనరుషిస్వామి ఆలయం నుంచి ఆదివారం ఈ ఊరేగింపు నిర్వహించారు. పద్మశాలీసంఘ సభ్యులు, ప్రతినిధులు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు, కల్యాణసామగ్రితో మెయిన్‌రోడ్డు, బోసురోడ్డు మీదుగా వైకుంఠపురం ఆలయం వరకు ఊరేగింపు చేశారు. జొన్నాదుల మహేష్, గుంటి వెంకట్, తిరువీధుల సాంబశివరావు, పంచుమర్తి భాస్కరరావు, గోపాలరావు, భాస్కర్, వెంకటేష్, బాలాజీ బాల శ్రీనివాసరావు, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.